


సాయంకాలం ఆకాశం రకరకాల రంగుల్తో అలంకరించుకుంటుంది. నెమ్మదిగా కదుల్తున్న మబ్బు ముక్కలు క్షణక్షణానికి ఆకారాలు మార్చుకుని తేలిపోతున్నాయి. వాటి వంక అలాగే చూస్తూ ఆలోచిస్తున్న పార్వతి మనసులోనూ ఎన్నోరకాల రంగుల ఆలోచనలు రూపు చేసుకుంటున్నాయి, విడిపోతున్నాయి.

సుమారు యిరవై యేళ్ల క్రితంనాటి మాట.

అప్పట్లో పార్వతి యూనివర్సిటీలో చదువుతోందేది. క్లాసు నాలుగుగోడల మధ్య చదువుకున్న విజ్ఞానమేకాక, యింకా ఎన్నోచూసి, చదివి, ఆలోచించి మనసుని వికసింప చేసుకుంటున్న మధురక్షణాలవి. చదువుకోవాలి, యింక పైనేం లేదన్నంతవరకు చదువుకుని ఒకరి అధికారానికి తలొగ్గకుండా స్వేచ్ఛగా సంపాదించుకుని జీవితం ఆదర్శవంతం చేసుకోవాలి. మామూలు ప్రతీ ఆడదాని లాగ యెవరికో ముడిపడి, పిల్లల్ని కని, వాళ్ల రోగాలు, ఏడుపులు, వంటల్తో సతమతమవుతూ, మరొకరి కోసం తనని బలి పెట్టుకుని రోజులు నెట్టేయడం అంటే చెప్పలేని భయం, అసహ్యం!..యీ గాడిలో పడి అందర్లాగా యెటో చావు వెతుక్కుంటూ కొట్టుకుపోకుండా, పూర్తిగా తన కోసం తను, తనకి యిష్టం వచ్చిన విధంగా బ్రతకాలని ఆమె అప్పట్లో నిశ్చయించుకుంది.

ఆ నిశ్చయం ఎవరెన్ని విధాల నచ్చచెప్పినా వదలలేదు. తల్లి, తండ్రి, అన్నలు అందరూ ఎన్నోవిధాల హితబోధలుచేశారు. ఆఖరిసారి యింట్లో పెద్దరభసే జరిగింది. ఎన్నో సంబంధాలు చూడకుండానే తిరస్కరించింది. ఆఖరిసారి ఆమెకి తెలియకుండా పెళ్ళిచూపులు ఏర్పాటు చేశారు. యిష్టం లేకపోయినా కూర్చోక తప్పలేదు. అప్పుడే తన నిశ్చయాలని బయట పెట్టింది. యింట్లో అందరూ అనేకవిధాల నచ్చచెప్పబోయారు.

“యింత మంచి సంబంధం తపస్సు చేసినా మళ్లీ దొరకదు. పదిహేను వందలు జీతం. విదేశాలు వెళ్లి వచ్చాడు. వినయం, విధేయత, సంస్కృతి, సంస్కారం ఉన్నవాడు. అందగాడు, ఆస్తిపరుడు. అన్నిటిని మించి నీ వంటే చాల యిష్టపడ్డాడు. నీ వెందుకింత మూర్ఖంగా అతన్ని తిరస్కరిస్తున్నావో మాకు అర్థం అవడం లేదు.” అన్నయ్య కోప్పడ్డాడు. వద్దంటున్న కొద్దీ, దాన్నిలా డిగ్రీల మీద డిగ్రీలు చదివించారు. దాన్ని యిలా నెత్తి నెక్కించుకున్నారు. యింక యిప్పుడది మన మాట వింటుందా!” అమ్మ విసుక్కుంది.

“బాగా ఆలోచించు తల్లీ, చదువుకున్న దానివి. పెళ్లి కాకుండా యెన్నాళ్లుంటావు! నిన్ను కన్నందుకు మా బాధ్యత మేము నెరవేర్చాలి గదా! నీకు పెళ్లి చెయ్యకుండా ఎన్నాళ్ళు చూస్తూ వూరుకుంటాం?’ నాన్న బ్రతిమిలాడారు.

“పెళ్లి చేసుకోకుండా, ఎమ్మెస్సీ, డియస్సీ అయి, విదేశాలు వెళ్లి తిరిగొచ్చి యింకా పరిశోధించి, కనిపెట్టి, పేరు పొంది నోబుల్ ప్రైజు కొట్టేసి.. యింక ఆతర్వాత ఏం చేస్తావు?” చిన్నన్నయ్య వేళాకోళం.

యిన్ని హితోపదేశాలు, మందలింపులు, వెక్కిరింపులు, అనునయాలు, కోపాలు, ఆగ్రహాలని ఎదుర్కోవలసి వచ్చిందో ఆనాడు పైకి చదవాలన్న తన కోరిక నెరవేర్చుకోడానికి! మొత్తానికి ఎలాగైతేనేం, అన్ని అవరోధాలని దాటి తన ఆదర్శం చేరుకోగలిగింది. తన ఆశయం నెరవేర్చుకోగలిగింది.

యీ దేశంలో ఒక డాక్టరేట్, విదేశాల్లో ఒక డాక్టరేట్ పొందింది. తిరిగి వచ్చాక మొదట్లోనే పెద్ద జీతంతో మొదలై యూనివర్సిటీలో ప్రొఫెసరుగా పని చేస్తోంది. కాలేజీలో యెంతో పేరు. ఆమె అంత మేధావి ఆమెలాగ అతిసూక్ష్మంగా వివేచించి, వ్యక్తం చెయ్యగలవారు లేరంటారు. యెన్నో పుస్తకాలు చదువుతుంది. ఆమె సబ్జక్టే గాక, యింకా యేవేవో యితర విషయాల మీద! జ్ఞానాన్ని అన్వేషించాలని, ఆర్జించాలని ఆమెకున్న తృష్ణ యిప్పటి

